సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



సమాజ భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి

ప్రజలు సమాజ అభివృద్ధిలో భాగస్వాములై నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని వైవీయూ వీసీ జింక రంగ జనార్దన పేర్కొన్నారు. -8లో..



ఆటో, బస్సు ఢీకొని ఇద్దరు మృతి

గాలివీడు మండలంలోని గోరాన్ చెరువు వద్ద ఆటో, బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.90	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 194 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	665	665
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 52.56 కిలోలు

న్యూస్‌రీల్

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



భాకరాపేటలో డ్రమ్‌లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు నీటి నిల్వలను, ఇళ్ల సమీపంలోని డ్రమ్‌లలో నిల్వ ఉన్న నీటిని ఆయన పరిశీలించారు. దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, సీహెచ్‌ఓ రాహుల్, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతికళ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పవన్‌కుమార్ నామినేషన్



రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్

వైవీయూ: పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పట్టుపోగుల పవన్‌కుమార్ శుక్రవారం తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతపురంలో రిటర్నింగ్ ఆఫీసర్ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన ఈయన 'బ్లడ్ టు లివ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రక్తదాన ఉద్యమం, సేవలు అందించారు.

హరహర మహాదేవ..

- నేడు మహాశివరాత్రి
- శైవ క్షేత్రాల్లో ఘనంగా ఏర్పాట్లు
- కొండ కోనలకు భక్తజనం



నాగనాథేశ్వరుడు



నాగనాథేశ్వరకొండ వ్యూ

కడప కల్చరల్ : శివుడు..భోళాశంకరుడు..ఆకు, పండు, పువ్వు, నీరు ఇలా ఏదీ ఇచ్చి మనసారా మొక్కినా భక్తులను కరుణిస్తాడు..వరాలు కురిపిస్తాడు..ఆపదలో ఆదుకుంటాడు..అందుకే ఆయన భక్తవ శంకరుడు. అలాంటి మహాశివరాత్రి భక్తులకు ఎంతో ముఖ్యమైనది. ఈ పండుగను నిర్వహించుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. నిర్వాహకులు శివాలయాలను అందంగా తీర్చిదిద్దారు. జిల్లాలో ప్రముఖ శివాలయాలు అందులోనూ అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాల సంఖ్య 15కు పైగానే ఉంది. దీంతో తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా శివరాత్రి సందర్భంగా భక్తులు జిల్లాకు వస్తుంటారు. పుష్పగిరి, చిట్వేలి, దేవుని కడప తదితర ప్రాంతాల్లో శైవ, వైష్ణవ ఆలయాలు పక్కపక్కనే ఉన్నాయి. నిత్యపూజస్వామిని భక్తులు వైష్ణవ సంప్రదాయంలోనే అర్చిస్తారు. అడుగడుగునా గోవింద నామస్మరణ చేస్తారు. ఈ సంవత్సరం పండుగ శనివారం రావడంతో భక్తులు మరింత ఉత్సాహంగా ఉన్నారు. మహాశివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో సోమవారం పూజలు నిర్వహించడానికి జిల్లా దేవదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖ, పోలీసు, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్యశాఖ శాఖల సహకారంతో ఇప్పటికే పలుమార్లు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలను పరిశీలించారు. పోలీసు అధికారులు కూడా తమ పరిధిలోని శైవ క్షేత్రాలకు బందోబస్తు కోసం తరలివెళ్లారు. భక్తులు శుక్రవారం ఉదయం నుంచే అటవీ క్షేత్రాల బాటపట్టారు. మొక్కులుగల భక్తులు ప్రత్యేక వాహనాలను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. శుక్రవారం మధ్యాహ్నానికే అటవీ ప్రాంతాల దారులు జనమయం అయ్యాయి. సాయంత్రానికి ఆయా క్షేత్రాలు భక్తులతో రద్దీగామారాయి. శివనామ స్మరణతో ఆయా క్షేత్రాలు మార్మోగాయి.

భక్తజన ప్రవాహం

శివరాత్రి సందర్భంగా శివయ్యకు విశేష పూజలు నిర్వహించనున్నారు. జిల్లాలో లక్షల మంది హాజరయ్యే క్షేత్రాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పొలతల, నిత్యపూజస్వామికోన, అత్తిరాల, భైరవకోన, గుండాల కోన, కపర్దీశ్వరకోన, కన్యతీర్థం, భానుకోట, నాగనాథేశ్వరకొండ తదితర ప్రాంతాలకు భక్తులు భారీగా హాజరవుతారు. కొండకు వెళ్లే భక్తులకు ధార్మిక సంఘాల ప్రతినిధులు ఆహార పొట్లాలు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నారు. దాదాపు అన్ని ఆలయాలలో పండుగ సందర్భంగా శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భజనలు, ప్రవచనాలు, భక్తి గీతాలాపనలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి లింగోద్భవం సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు.



పొలతలలో బందోబస్తు గురించి పోలీసులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అత్తిరాలలో ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ వెలుగుల్లో అత్తిరాలలోని త్రేతేశ్వర ఆలయం

రాజంపేట రూరల్: అన్నమయ్య జిల్లాలోని శైవ క్షేత్రమైన అత్తిరాలలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. శివరాత్రి నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ కొలువుదీరిన కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దాదాపు లక్ష మంది భక్తులు ప్రతి ఏడాది వస్తుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ జీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో రూరల్, అర్బన్ సీఐలు పుల్లయ్య, నరసింహులుల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మహాశివరాత్రిని పురస్కరించుకొని 3,108 టెంకాయలతో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజంపేటశాఖ ఆధ్వర్యంలో 9 అడుగుల ఎత్తుగల శివలింగాన్ని ఏర్పాటు చేశారు. 3వేలకు పైగా టెంకాయలతో శివలింగం ఏర్పాటు చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే.సావిత్రి తెలిపారు. సంస్థ ప్రతినిధులు శివకేశవులు, వీ.నాగరాజు, పీ.సంతోష్‌కుమార్, చలపతి, రాజేశ్వరి ఈ శివలింగాన్ని తయారు చేసినట్లు తెలిపారు. -రాజంపేట టౌన్

యాలివాహనంపై రాచరాయుడు

రాయచోటిటౌన్ : రాచవీడు శ్రీ రాచరాయుడి(శ్రీ వీరభద్రస్వామి) బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం నవగ్రహ హోమం నిర్వహించారు.తర్వాత స్వామి వారు యాలివాహనంపై విహరించారు. అంతకుముందు స్వామి , అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు.ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి, విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించి, యాలివానంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.



యాలివాహనంపై విహరిస్తున్న శ్రీ వీరభద్రస్వామి

యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపిక



యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన దీపన్‌సాయి, ఫయాజ్ అలి, సాజిద్, అఖిబ్, భవాని ప్రసాద్, మల్లేశన్, కార్తీక్

వాల్మీకిపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో శిక్షణ పొందే ఏడుగురు క్రికెట్ క్రీడాకారులు విశేష ప్రతిభ చూపి నగరాల్లోని వివిధ యూనివర్సిటీ క్రికెట్ జట్లకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సబ్ సెంటర్ కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీకి చెందిన దీపన్ సాయి, ఫయాజ్ , అఖిబ్, సాజిద్, భవాని ప్రసాద్, జేఎన్టీయూ యూనివర్సిటీకి చెందిన మల్లేశన్, విట్ వేలూరు యూనివర్సిటీకి చెందిన కార్తీక్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 22 నుంచి మార్చి 4వ తేది వరకు బెంగుళూరు రేవా యూనివర్సిటీ మీట్‌లో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియాతో కలిసి జిల్లా కలెక్టర్ ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 13వ తేదీన జరిగే ఈ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి పోలింగ్ సామగ్రి, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల విషయంలో పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల మోడల్ కోడ్ ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, మైక్రో అబ్జర్వర్‌లను, రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పోలింగ్‌స్టేషన్ల వారీగా అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళి, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టండి


రాయచోటి అర్బన్: పారిశుద్ధ్యం, చెత్తసేకరణ, ఇళ్లనిర్మాణంలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సచివాలయ ఉద్యోగులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని 9వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సంక్షేమప థకాల క్యాలెండర్, సచివాలయ సిబ్బంది రిజిస్టర్‌లను, రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూలు, ఆయుష్మాన్ భారత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ, ఇంటింటికి చెత్తసేకరణ పక్కాగా జరగాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

రాయచోటి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా కలెక్టర్ వీసీ ద్వారా సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ధనలక్ష్మీ, హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పీఆర్‌ఎస్‌ఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలకు వేళాయె..

- నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహణ
- సూచనలు పాటిస్తే 30/30 సాధ్యమే
- ఈనెల 20 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



మదనపల్లె సిటీ: విద్యార్థి దశలో అత్యంత కీలకమైనది ఇంటర్మీడియెట్. ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కోర్సులు అభ్యసించేందుకు కోరుకున్న కళాశాలలో, కోర్సులో సీటు దక్కించుకొనేందుకు ఇక్కడ సాధించే మార్కులే కీలకం. ఎంపీసీ,బైపీసీ విద్యార్థులు శ్రద్ధ చూపితే 30కి 30 మార్కులు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ప్రయోగ పరీక్షల షెడ్యూలు ఖరారైంది. ఈ ఏడాది నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాక్టికల్స్ పరీక్షల షెడ్యూలు

జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు జరగనున్నాయి. ఎంపీసీ అన్ని సబ్జెక్టులు కలిపి 60, బైపీసీ విద్యార్థులకు 120 మార్కులు కేటాయిస్తారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 7వతేదీ వరకు జనరల్ కోర్సులు, ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7వతేదీ వరకు ఆదివారాలతో సహా ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఫిబ్రవరి 15న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ , ఫిబ్రవరి 17న ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు.



ప్రయోగశాలలో విద్యార్థులు




ఫలితం తప్పనిసరి



కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌కు మూడు గంటల సమయం ఇస్తారు. మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో లవణ విశ్లేషణ ఉంటుంది. లవణ విశ్లేషణలో భౌతిక పరీక్షలు చేసిన తర్వాత రసాయన పరీక్షలు చేసి, ఆనయాన్, కాటయాన్‌లను గుర్తించడం, వాటి నిర్ధారణ పరీక్షలు ముఖ్యమైనవి. చివరగా ఫలితం తప్పనిసరిగా రాయాలి. రెండో విభాగంలో ఘన పరిమాణాత్మక విశ్లేషణకు 8 మార్కులు, ప్రాక్టికల్ ప్రారంభమైన మొదటి పది నిమిషాల్లో ప్రయోగ విధానం రాయాలి. మూడో విభాగానికి ఆరు మార్కులు. ఏ నుంచి డి వరకు ప్రశ్నల్లో ఒకటి మాత్రమే రాయాలి. ఏ ప్రశ్న కర్బక సమ్మేళనంలో ప్రమేయ సమూహాన్ని గుర్తించడం, బి ప్రశ్న కొల్లాయిడ్ ద్రావణాలను తయారు చేయడం, సీ ప్రశ్న క్రొమట్రోగఫీ, డి ప్రశ్న కార్బోహైడ్రేడ్, ప్రొటీన్ల చర్యలపై ఉంటాయి. వైవాకు, ప్రాజెక్టు రికార్డు, జనరల్ రికార్డుకు రెండేసి మార్కులు వంతున ఆరు మార్కులుంటాయి. -చంద్రశేఖర్, రసాయనశాస్త్ర అధ్యాపకులు

మంచి మార్కులు సాధించవచ్చు



భౌతికశాస్త్రానికి మూడు గంటల సమయానికి 30 మార్కులు కేటాయిస్తారు. మొత్తం 20 ప్రయోగాల్లో ఆరు విభాగాల నుంచి 38 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి బ్యాచ్‌కు 12 ప్రశ్నల వంతున ఇస్తారు. ప్రయోగ సూత్రానికి రెండు మార్కులు, ప్రయోగ విధానానికి మూడు మార్కులు, పట్టికలు, పరిశీలనలు, గ్రాఫ్‌లకు 8, కాలిక్యులేషన్స్‌కు 4, జాగ్రత్తలకు 2, ఫలితం, ప్రమాణాలకు 2 మార్కులు, రికార్డులకు 4, వైవాకు 5 మొత్తంగా 30 మార్కులుంటాయి. లాగర్‌థమ్స్ ఉపయోగిస్తూ కాలిక్యులేషన్స్ చేస్తే పూర్తి మార్కులు వస్తాయి. అన్ని ప్రయోగాలకు జాగ్రత్తలు తప్పనిసరిగా రాయాలి. -జి.వెంకటరాముడు, భౌతికశాస్త్ర అధ్యాపకుడు

సూటిగా సమాధానాలు చెప్పాలి



వృక్షశాస్త్రం ప్రయోగ పరీక్షకు 30 మార్కుల ప్రశ్నపత్రంలో ఐదు విభాగాలు ఉంటాయి. ఒకటో ప్రశ్న వృక్షవర్గీకరణ శాస్త్రంలో మూడు కుటుంబాల్లో ఒక కుటుంబం నుంచి వస్తుంది. వర్ణన క్రమపద్ధతిలో రాయాలి. ఇచ్చిన మొక్కను బట్టి పుష్పచిత్రం, సమీకరణం, కుటుంబ గుర్తింపు తప్పనిసరి. రెండో ప్రశ్న వృక్ష అంతర్నిర్మాణ శాస్త్రం నుంచి వస్తుంది. మూడో ప్రశ్న వృక్ష శరీర ధర్మశాస్త్రం నుంచి వస్తుంది. నాలుగో ప్రశ్నకు ఐదు మార్కులు పొందవచ్చు. స్పాటరు లేదా స్లైడును గుర్తించి దాని లక్షణాలు రాయాలి. రికార్డు, హెర్బేరియాలలో హెర్బేరియాను నీట్‌గా తయారు చేసి కవర్‌లో ఉంచి కవర్‌పై నంబర్ వేయాలి. -కొండయ్య, వృక్షశాస్త్ర అధ్యాపకుడు

భాగాల గుర్తింపు ముఖ్యం



జంతుశాస్త్ర ప్రయోగపరీక్షల్లో మూడు ప్రశ్నలుంటాయి. ఒకటో ప్రశ్నగా చార్ట్‌ను డిస్‌ప్లే చేస్తారు. టైటిల్ చెప్పి పటం గీసి భాగాలను గుర్తించాలి. వీటికి ఆరు మార్కులు. రెండో ప్రశ్నగా ఫిజియాలజీ ప్రయోగం ఇస్తారు. ఈ ప్రశ్నకు మూలసూత్రం, ప్రయోగవిధానం, ఫలితం తప్పనిసరిగా రాయాలి. మూడో ప్రశ్నలో స్లైడులు, స్పెసిమెన్స్ కలిపి ఏడు రకాల స్పాటర్స్ ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు, నాలుగో ప్రశ్న రికార్డు. దానికి ఐదు మార్కులు. జువాలజీ ప్రాక్టికల్స్‌లో 30 మార్కులు తెచ్చుకోవడం సులువు. అయితే ప్రణాళికాబద్దంగా సన్నద్ధం చేయాలి. -లలిత, జంతుశాస్త్ర అధ్యాపకురాలు

రూ.23 లక్షల విలువజేసే 109 సెల్‌ఫోన్లు రికవరీ



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి: మొబైల్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టం సాయంతో రూ. 23 లక్షలు విలువజేసే 109 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు వెల్లడించారు. రాయచోటిలోని పోలీసు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా పరిధిలో నేటి వరకు సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి 539 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో 130 యాక్టీవ్ మొబైల్స్‌గా గుర్తించామన్నారు. 109 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించినట్లు ఎస్పీ తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితు లు స్టేషన్‌కు వెళ్లకుండా 8688830012 నంబర్‌కు హాయ్ అని వాట్సాప్ మెసేజ్ చేస్తే తద్వారా వచ్చే లింక్‌తో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ యాప్‌ను ప్రారంభించిన 15 రోజుల్లో లక్షలాది రూపాయలు విలువజేసే సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీలో సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు.

జాతర్ల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలో జరుగుతున్న జాతర్లను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ హర్షవర్దన్ రాజు తెలిపారు. జిల్లాలో రాయచోటి వీరభద్రస్వామి మహోత్సవం, లక్కిరెడ్డిపల్లెసమీపంలోని గంగాభవానమ్మ జాతరలకు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

క్లుప్తంగా

ఎస్‌ఈబీ విస్తృత దాడులు

– నాటు సారా స్థావరాలు ధ్వంసం

నిమ్మనపల్లె : మండలంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారిపల్లెలో బంగి గంగాధర్ నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే మూడు డ్రమ్ములలో నిల్వ ఉన్న 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, నేరంతో ప్రమేయం ఉన్న గంగాధర్ స్నేహితుడైన మరో వ్యక్తి పైన కేసు నమోదు చేశారు. నాటుసారా తయారీకి ముడిసరుకు బెల్లంను సరఫరా చేసిన నిమ్మనపల్లెలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర జనరల్ స్టోర్స్ యజమాని చంద్రగిరి బాలచంద్ర నుంచి సుమారు 500 కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్ట్ చేశారు. దాడుల్లో ఎస్ఐ అంజద్‌బాషా, సిబ్బంది త్రిపురేంద్రుడు, హరికుమార్, దామోదర్, ప్రసన్నకుమార్, రూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీకి చెందిన తాజుద్దీన్ కుమారుడు బి.షఫీవుల్లా(29) అనే యువకుడు వలంటీర్‌గా పని చేస్తున్నాడు. దీంతోపాటుగా పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. పుంగనూరుకు చెందిన వాజీదాను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కొంతకాలం పాటు సజావుగా సాగిన వారి కాపురంలో కుటుంబ సమస్యలతో మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్య పుట్టింటికి వెళ్లిపోయి, పుంగనూరుకు వస్తే కలిసి ఉందామని, లేకపోతే కాపురానికి వచ్చేది లేదని తెగేసి చెప్పింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినా ఫలితం లేకపోగా, వలంటీర్‌పై మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వేధింపుల కేసు పెట్టింది. దీంతో ఇటీవల మనస్తాపానికి గురైన షఫీవుల్లా గురువారం రాత్రి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.

ఒంటరి జీవితం భరించలేక ఆత్మహత్య


విజయ్‌కుమార్ మృతదేహం

ములకలచెరువు : ఒంటరి జీవితం భరించలేక ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పర్తికోటకు చెందిన గాలేటి విజయ్‌కుమార్(54) కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవాడు. వివాహమైన కొన్ని రోజులకే భార్య రామలక్ష్మి కుటుంబ కలహాలతో అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్య తిరిగి రాలేదు. వయసు మీద పడుతుండడంతో చూసేవాళ్లు లేక ఇబ్బంది పడ్డాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో గురువారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇస్తేమాకు సర్వం సిద్ధం



టిప్పుసుల్తాన్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా, ఇస్తేమా నిర్వహణకు ఏర్పాటవుతున్న చలువ పందిళ్లు

- నేడు మదనపల్లెలో ప్రారంభం
- రెండు రోజుల పాటు నిర్వహణ
- రెండు లక్షల మందికి పైగా హాజరవుతారని అంచనా
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె పట్టణం.. భారీ స్థాయిలో నిర్వహించనున్న ముస్లిం ధార్మిక సదస్సు ఇస్తేమాకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. శని, ఆదివారాలు (రెండు రోజుల పాటు) జరగనున్న ఇస్తేమాకు రాయలసీమలోని ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన ముస్లింలు సుమారుగా 2లక్షలకు పైగానే హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తబ్లీగి-ఏ-ఇస్తేమా ప్రారంభానికి ముందే వేల సంఖ్యలో ముస్లింలు ధార్మిక సదస్సు నిర్వహించే ప్రాంగణానికి చేరుకుని తమ వంతు సాయంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరోనాతో రెండేళ్లపాటు నిర్వహించలేకపోయిన ఇస్తేమాను ఈసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు శ్రమిస్తున్నారు. ఇస్తేమాకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్‌తోపాటుగా భోజనాల కోసం తాంఖానాలు ఏర్పాటు చేశారు. ఇస్తేమా ఏర్పాట్లు, అతిథులకు కావాల్సిన సౌకర్యాలు, నమాజ్ చేసుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు, వజూ, బాత్‌రూమ్ తదితర వసతులన్నింటికీ పట్టణానికి చెందిన ముస్లింలు వలంటీర్లుగా మారి తమవంతు సేవలందిస్తున్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చే జమాత్‌లు బస చేసేందుకు ప్రత్యేక టెంట్‌లతోపాటుగా నీరు, టాయిలెట్ సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఇస్తేమా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాయచోటి, మదనపల్లె ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా టిప్పుసుల్తాన్ మైదానానికి వచ్చారు. ఇస్తేమా ఏర్పాట్లపై నిర్వాహకులతో చర్చించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని వారు చెప్పారు. ముస్లింలతో కలిసి జుమా నమాజ్‌లో పాల్గొని, అనంతరం వారితో కలిసి అక్కడే భోజనం చేశారు. మౌలికవసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ తదితరాలపై మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లక్షల సంఖ్యలో ముస్లింలు ఒక చోటకు చేరి ధార్మిక సదస్సు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ధార్మిక సదస్సుకు కులమతాలకు అతీతంగా ఎవరైనా హాజరు కావచ్చన్నారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ అహ్మద్, మదనపల్లె మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ క్రికెట్ జట్లకు ఎంపిక

వాల్మీకిపురం : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో శిక్షణ పొందే ఏడుగురు క్రీడాకారులు క్రికెట్‌లో విశేష ప్రతిభ చూపి నగరాల్లోని వివిధ యూనివర్సిటీ క్రికెట్ జట్లకు ఎంపికైనట్లు సబ్ సెంటర్ కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీకి దీపన్‌సాయి (స్పిన్‌బౌలర్), ఫయాజ్ అలి (మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మ్యాన్), అఖిబ్ (ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్), సాజిద్ (మీడియం పేసర్), భవాని ప్రసాద్ (ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్)లు ఎంపికయ్యారన్నారు. అలాగే జేఎన్టీయూ యూనివర్సిటీకి మల్లేశన్ (మీడియం పేసర్), విట్ వేలూరు యూనివర్సిటీకి కార్తీక్ (మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మ్యాన్)లు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి మార్చి 4వ తేది వరకు బెంగళూరు రేవా యూనివర్సిటీ మీట్‌లో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల జీవీఎస్‌సీఎస్ అండర్ వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ ఫౌండర్ శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు ఖాదర్‌బాబా, షాహెద్, భరత్, పఠాన్, రామక్రిష్ణ, రెడ్డి, ముజీర్, క్యాంపు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఎగువభద్ర ప్రాజెక్ట్ నిర్మాణం ఆపాలని పోరు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జనార్దన్

రాయచోటి అర్బన్ : ఎగువభద్ర ప్రాజెక్ట్ నిర్మాణం ఆపాలని పోరుబాట పట్టేందుకు రైతులు సిద్ధం కావాలని అఖిలపక్ష, రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి అధ్యక్షతన ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.జనార్దన్ మాట్లాడుతూ ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.53,00 కోట్లను కర్ణాటక రాష్ట్రానికి కేటాయించడం, జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడం తగదన్నారు. కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపొందాలనే కుట్రలో భాగమే ఇదన్నారు. ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్ మాట్లాడుతూ ఎగువ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఏడారిగా మారుతాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వంగి మళ్ళరంగారెడ్డి మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసేందుకు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేత రెడ్డెయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, ఎంఆర్‌పీఎస్ నేత ఎస్.రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, లంబాడ సంఘం నేత శంకర్‌నాయక్, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్రనేత సగీర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నేత మండెం సుధీర్, విద్యావంతుల వేదిక నేతలు మారుతి, చల్లారెడ్డెయ్య, జనసేననేత రామా శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, మహిళా సమైక్య నాయకురాలు సుమిత్ర, బీఎస్పీ జిల్లా నేత యుగంధర్, దళితమిత్ర నేత కిషోర్, ఏఐటీయూసీ నేతలు వెంకటరమణ, పుల్లయ్యతోపాటు పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరాయి స్త్రీ మోజులో భార్యపై భర్త దాడి


గాయపడ్డ సుజాత

మదనపల్లె : పరాయి స్త్రీ మోజులో పడి కట్టుకున్న భార్యపై భర్త దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. వేంపల్లె పంచాయతీ బండకిందపల్లెకు చెందిన భాస్కర్, ఆయన భార్య సుజాత(40) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భాస్కర్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళ మోజులో పడటంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. తరచూ గొడవలు జరుగుతుండటంతో పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినప్పటికీ భాస్కర్‌లో మార్పు రాలేదు. గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగి మాటకుమాట పెరిగి తీవ్ర స్థాయికి చేరింది. భార్య సుజాతపై భాస్కర్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఇంటి నుంచి గెంటేశాడు. తీవ్ర గాయాలతో బాధపడుతున్న ఆమెను గమనించిన ఇరుగు పొరుగు వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అర్చకుడిపై దాడి


చికిత్స పొందుతున్న లోకనాథ్ దీక్షిత్

రామసముద్రం : మండల పరిధి బల్లసముద్రం సమీపంలోని కొండపై వెలసిన శ్రీ వాలీశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు లోకనాథ్ దీక్షిత్‌పై దాడి చేసిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండపై క్యూలైన్లు ఏర్పాటు చేస్తుండగా బల్లసముద్రం గ్రామానికి చెందిన నందకుమార్, మల్లికార్జున రేకులు అడ్డు పెడుతుండగా.. ప్రశ్నించినందుకు అర్చకులు లోకనాథ్ దీక్షిత్ పై, అర్చకుని కుమారుడు మణికంఠ, అల్లుడు రాజశేఖర్‌లను దుర్భాషలాడి దాడి చేశారని తెలిపారు. కొండపై తాము ఏం చేస్తే అదే జరగాలని హుకుం జారీ చేస్తూ తనపై కట్టెలతో దాడి చేసి గాయపరిచారని అర్చకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

రాజంపేట టౌన్ : మండలంలోని మందపల్లె అరుంధతివాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దాసరి వెంకటేశును సస్పెండ్ చేస్తూ డీఈఓ ఎద్దల రాఘవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశు రెండు సంవత్సరాలుగా పాఠశాలకు సక్రమంగా హాజరు కాకపోవడం, పాఠశాలకు వచ్చినా విద్యార్థులకు చదువు చెప్పకుండా ఫోన్‌లో మాట్లాడుతుండటం, లేకుంటే కుర్చీలో కూర్చొని నిద్రపోవడం, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడే తీరు కూడా బాగా లేదని ఆ పాఠశాల కమిటీ చైర్మన్, గ్రామస్తులు డీఈఓకు ఫిర్యాదు చేశారని ఎంఈఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు తాము విచారణ చేపట్టి నివేదికను పంపగా ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ఆటో, బస్సు ఢీకొని ఇద్దరు మృతి

– ఐదుగురికి తీవ్ర గాయాలు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు, ఆటో


మృతి చెందిన సాధిక్

గాలివీడు : మండలంలోని గోరాన్ చెరువు వద్ద ఆటో, బస్సు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మహబూబ్ బాషా (33), సాధిక్ (11) మృత్యువాత పడ్డారు. ఎస్ఐ వెంకట శివకుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం గొట్టివీడులోని ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు శుక్రవారం రాత్రి ఆటోలో గాలివీడుకు వెళ్తున్నారు. మార్గంమధ్యలోని గోరాన్ చెరువు గుట్టవద్ద డంపింగ్ యార్డు సమీపంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు వచ్చింది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు, పోలీసులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యుల సూచన మేరకు వారిని తిరుపతికి తరలించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు.

నెలన్నర తర్వాత స్వస్థలానికి మృతదేహం

అనారోగ్యంతో జనవరి 3న కువైట్‌లో మహిళ మృతి


కువైట్‌లో జ్యోతి మృతదేహం వద్ద ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎస్.మహేశ్వర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె దళితవాడకు చెందిన సగినాల జ్యోతి(31) మృతదేహం నెలన్నర రోజుల తర్వాత స్వస్థలానికి చేరింది. ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ ఏడాది జనవరి 3న కువైట్‌లో మరణించింది. ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం కువైట్‌లో ఇంటి పని నిమిత్తం వెళ్లిన సగినాల జ్యోతి కువైటీ(సేఠ్) ఇంట్లో పని ఎక్కువగా ఉన్నందున పారిపోయింది. బయట పనులు చేసుకుంటూ ఉండగా, ఆరు నెలల క్రితం అనారోగ్యం బారిన పడింది. తెలిసిన వారి సాయంతో వారి రూములో ఉంటూ జనవరి 3న మరణించింది. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించాలని వారి బంధువులు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని అభ్యర్థించగా, ఆయన వెంటనే స్పందించి ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్‌కు తెలియజేశారు. కువైట్‌లో కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్లు ఎస్.మహేశ్వర్‌రెడ్డి, గోవిందు నాగరాజులు ఆమె మృతదేహాన్ని ఇండియాకు పంపేందుకు భారత రాయబార అధికారులతో మాట్లాడారు. కువైట్ ఇమ్మిగ్రేషన్ వారు పొరపాటున జ్యోతిని శ్రీలంక దేశస్తురాలిగా నమోదు చేయడం వల్ల ఇండియాకు పంపడం చాలా కష్టతరంగా మారింది. ఆమె ఇండియాకు చెందిన మహిళ అని నిరూపించిన తర్వాత, మృతదేహాన్ని పంపేందుకు అయ్యే ఖర్చులు కూడా భారత రాయబార కార్యాలయమే భరించేలా ఒప్పించారు. ఎట్టకేలకు ఈనెల 17న జ్యోతి మృతదేహాన్ని చెన్నై విమానాశ్రయానికి పంపగా, అక్కడి నుంచి వారి బంధువులు స్వస్థలం చింతరాజుపల్లెకు తీసుకెళ్లారు. చెన్నై నుంచి చింతరాజుపల్లెకు ఏపీఎన్ఆర్‌టీఎస్ ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించింది.

పాఠశాలకు ఎంపీ రూ.1.50 లక్షల విరాళం


పాఠశాల కమిటీ చైర్మన్‌కు రూ. 1.50 లక్షలు అందజేస్తున్న నాయకులు

గుర్రంకొండ : గుర్రంకొండలోని ఏడవ వార్డు ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రూ.1.50 లక్షలు విరాళం ఇచ్చారు. పాఠశాలకు ప్రస్తుతం ఉన్న భవనాలు సరిపోక పోవడంతో పక్కనే ఉన్న ప్రయివేట్ స్థలం కొనుగోలు చేయడానికి ఉపాధ్యాయులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ఎంపీ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ మిథున్‌రెడ్డి అదనపు భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలం కొనుగోలుకు రూ.1.50 లక్షలు అందజేశారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీ తరపున మాజీ ఎంపీపీ జమీర్‌ఆలీఖాన్ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అల్తాఫ్‌కు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఖదీర్, నాయకులు నాయిని శివశంకర్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

కడప ఎడ్యుకేషన్ : విధి నిర్వహణలో భాగంగా అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్వీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానికంగా వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకట శివారెడ్డి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, ఎంఈఓ సంఘం జిల్లా అధ్యక్షులు జాఫర్ సాధిక్, కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, గౌరవాధ్యక్షుడు పాలెం నారాయణలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు మిట్టా క్రిష్ణయ్య పేర్కొన్నారు. కడప పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఏబీ రామకృష్ణమరాజు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి వెంకట రమణ, రవిశంకర్, రాష్ట్ర కార్యదర్శులు వారాల శ్రీనివాసులు, ఆదిల్‌బాషాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాసనమండలికి పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థులు తమ అనుబంధ విద్యాసంఘాల నేతలను అడ్డుపెట్టుకొని ఇలాంటి దాడులకు పాల్పడటం సిగ్గుచేటని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవీ రామచంద్రారెడ్డి అన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి


మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య జింక రంగ జనార్థన

వైవీయూ : ప్రజలు చైతన్యవంతులై సమాజ అభివృద్ధిలో భాగస్వాములైనప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్ధన పేర్కొన్నారు. వైవీయూలో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో యువత భాగస్వామ్యం' అన్న అంశంప ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ శిక్షణ ఫలాలు క్షేత్రస్థాయికి చేర్చాలని ఎన్ఎస్ఎస్ పీఓలకు సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్ఎస్ఎస్ పీఓలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి, రీసోర్స్‌పర్సన్‌లు ఇషానిషేన్, నవ్యరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

సముద్ర శాస్త్రవేత్తలకు పునాది పరిశోధన గ్రంథం

సముద్ర తీర ప్రాంతాలకు సంబంధించిన పాఠ్యాంశాలను సంకలన పరిచి ఒక పుస్తక రూపంలో భూవిజ్ఞానశాఖ ఆధ్వర్యంలో తీసుకురావడం దక్షిణ భారతదేశంలోనే తొలి ప్రయత్నమని, ఈ పుస్తకం సముద్ర శాస్త్రవేత్తలకు ఒక పునాది లాంటిదని వైవీయూ వీసీ ఆచార్య జింక రంగ జనార్ధన అన్నారు. 'సముద్ర తీరప్రాంతాలు, నదులు, సరస్సులు- సుస్థిర అభివృద్ధి' అన్న అంశంపై జియాలజీశాఖ ఆచార్యులు ఎస్.జయరాజు, పరిశోధన బృందం సభ్యులు డాక్టర్ జి.శ్రీనివాసులు (కొరియ), డాక్టర్ ఎం.మాదక్క, డాక్టర్ ఎం.మంజులత (కొరియా) సహ సంపాదకులుగా రూపొందించిన పుస్తకాన్ని వీసీ ఆచార్య రంగ జనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ఆచార్య ఎన్. జయరాజ్, ఆచార్య వి.సునీత, ఆచార్య రఘుబాబు, ఆచార్య సుదర్శన్‌రాజు, డాక్టర్ శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

ఒలింపిక్ సంఘం..
ఎన్నికల వైపు అడుగులు

- 19న నిర్వహించేందుకు ఏర్పాట్లు
- అనుమతివ్వని శాప్ అధికారులు

కడప స్పోర్ట్స్ : క్రీడల అభివృద్ధిలో పెద్దన్న పాత్ర పోషించే ఒలింపిక్ సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 19న జిల్లా ఒలింపిక్ సంఘం (ఆర్.కె.పురుషోత్తం ప్యానెల్) ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏపీ ఒలింపిక్ సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలను కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించేందుకు అనుమతులు కోరగా, క్రీడా సంఘాల గుర్తింపు విషయంలో స్పష్టత లేకపోవడంతో శా ప్ అధికారులు నిరాకరించారు. దీంతో ఈ నెల 19న క డప నగరంలోని కడప ప్రెస్ క్లబ్‌లో ఒలింపిక్ సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో 2018లో ఒలింపిక్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా తోటకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జిలానీబాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో వారు వైదొలగగా, వారి స్థానంలో ఉపాధ్యక్షుడిగా ఉన్న కె.ఎస్.సమరనాథరెడ్డి అధ్యక్షుడిగా, కోశాధికారిగా ఉన్న ఎస్.రాజశేఖర్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ కమిటీ దాదాపు నాలుగేళ్ల పాటు కొనసాగడంతో గతేడాది గడువు పూర్తయింది. అప్పటి నుంచి జిల్లా ఒలింపిక్ సంఘం ఖాళీగా ఉంటూ వస్తోంది. అయితే ఏపీ ఒలింపిక్ సంఘం ఒక్కో జిల్లాలో ఒలింపిక్ సంఘం ఎన్నికలు పూర్తి చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో సైతం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు కనీసం రెండు, మూడు వారాల గడువు ఇచ్చి, ప్రకటన జారీ చేయాల్సి ఉంది. అయితే అలాంటి నిబంధనలను పట్టించుకోకుండా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

సంఘాల గుర్తింపు సమస్యే?

జిల్లా ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో పాల్గొనే క్రీడాసంఘాలు క్రీడా పాలసీని అనుసరించి రిజిస్ట్రేషన్, టోర్నమెంట్‌ల నిర్వహణ, ఆడిటింగ్, శాప్ గుర్తింపు, ఫెడరేషన్ గుర్తింపు, ఒలింపిక్ సంఘం గుర్తింపు తదితర అంశాలన్నీ సక్రమంగా ఉన్న క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అయితే క్రీడాసంఘాల్లోని వర్గాల కారణంగా ఒక్కో క్రీడాంశంలో రెండు, మూడు గ్రూపులు ఉండి ఒకరిపై ఒకరు కోర్టుల్లో కేసులు వేసుకుని ఉండటంతో ఎవరికి గుర్తింపు ఉందో, ఎవరికి గుర్తింపు లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో శాప్ అధికారులు జోక్యం చేసుకుని అర్హత కలిగిన సంఘాల ప్రతినిధులే ఎన్నికల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పలు క్రీడాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

కేసు కొట్టివేత

లక్కిరెడ్డిపల్లి : సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా వైఎస్ కొండారెడ్డిపై కేసును శుక్రవారం లక్కిరెడ్డిపల్లె ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి శారద కొట్టివేసినట్లు సమాచారం. ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టరును బెదిరించారన్న ఆరోపణలపై గత ఏడాది మే 9న చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేని కారణంగా ఈ కేసును శుక్రవారం కొట్టివేసినట్లు పోలీసువర్గాలు ధృవీకరించాయి.